# సాక్షి
# రాజన్న సిరిసిల్ల

మంగళవారం ¦ 11 ¦ జూలై ¦ 2023






### రాజన్నకు మొక్కులు

వేములవాడ: రాజన్నను సోమవారం 15 వేల మంది భక్తులు దర్శించుకున్నారు. మహారాష్ట్ర నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.



### ఫీ'జులుం' అరికట్టాలి

సిరిసిల్లటౌన్: ప్రైవేటు ఇంటర్ కాలేజీల్లో ఫీజుల దోపిడీని అరికట్టాలని ఏఐఎస్ఎఫ్ విద్యార్థి నాయకులు కోరారు. ఈమేరకు డీఈవోకు వినతిపత్రం అందించారు.

గరిష్ఠం/కనిష్ఠం
34.0/26.0

### వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. జిల్లాలో స్వల్పంగా వర్షం కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. గాలి వేగంగా వీస్తుంది.

## న్యూస్‌రీల్

### ప్రజాసంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



రెడ్డి సంఘం పనులు ప్రారంభిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్

కోనరావుపేట(వేములవాడ): ప్రజాసంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తుందని జెడ్పీ చైర్ పర్సన్ న్యాలకొండ అరుణ పేర్కొన్నారు. కోనరావుపేట మండలం కొండాపూర్‌లో రెడ్డి సంఘం బ్యాలెన్స్ పనుల కోసం రూ.3 లక్షలు అందించి సోమవారం పనులు ప్రారంభించారు. అరుణ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటైనప్పటి నుంచి అన్ని వర్గాల ప్రజల కోసం అనేక పథకాలను అమలు చేస్తున్నారన్నారు. సర్పంచ్ మల్యాల దేవయ్య, ఎంపీటీసీ పల్లె మంజుల, సింగిల్‌విండో చైర్మన్ బండ నర్సయ్య, సర్పంచుల ఫోరం జిల్లా ప్రధాన కార్యదర్శి మంతెన సంతోష్, గుడాటి రెడ్డి సంఘం అధ్యక్షుడు మామిడి దామోదర్‌రెడ్డి, సంఘం పెద్దలు గడ్డం కిషన్‌రెడ్డి, మామిడి ప్రభాకర్‌రెడ్డి, కేతిరెడ్డి లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.

### బస్సు రావడంతో విద్యార్థుల హర్షం



వట్టిమల్లలో బస్సు రాకతో హర్షం వ్యక్తం చేస్తున్న విద్యార్థులు

కోనరావుపేట(వేములవాడ): మండలంలోని వట్టిమల్ల నుంచి కోనరావుపేట వరకు ఆర్టీసీ అధికారులు బస్సు సౌకర్యాన్ని కల్పించడంతో విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. వట్టిమల్ల నుంచి విద్యార్థులు కోనరావుపేటలోని మోడల్ స్కూల్‌కు వెళ్లి చదువుకుంటున్నారు. బస్సు సౌకర్యం లేక విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు. గ్రామస్తులు డిపో అధికారులను కలిసి బస్సు సౌకర్యం కల్పించాలని కోరారు. ఆర్టీసీ డిపో మేనేజర్ మురళీకృష్ణ, పీఆర్వో శ్రీనివాస్‌యాదవ్, వీబీవో మల్లేశ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

### జనపాలకు కథా సాహిత్య పురస్కారం



జాతీయ కథా సాహిత్య పురస్కారాన్ని అందుకుంటున్న డాక్టర్ జనపాల శంకరయ్య

సిరిసిల్లకల్చరల్: జిల్లా రచయితల సంఘం పూర్వ అధ్యక్షుడు డాక్టర్ జనపాల శంకరయ్యను జాతీయ కథా సాహిత్య పురస్కారం వరించింది. ములుకనూరు గ్రంథాలయం, సాహిత్యపీఠం సంయుక్తంగా నిర్వహిస్తున్న 2022 జాతీయ కథా సాహిత్య పురస్కారానికి జనపాలను ఎంపిక చేశారు. వరుసగా మూడోసారి ఈ పురస్కారం వరించడం. హైదరాబాద్‌లోని పొట్టి శ్రీరాములు విశ్వవిద్యాలయంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో వీసీ కిషన్‌రావు చేతుల మీదరుగా పురస్కారం అందించారు. లంబాడీల సాహిత్యంపై పరిశోధన చేసిన జనపాల పలు సాహిత్య ప్రక్రియల్లో రాణించారు. బలగం చిత్ర దర్శకుడి వేణు ఎల్దండి, సాహిత్య పీఠం అధ్యక్షుడు వేముల శ్రీనివాస్, శశిధర్, జనార్దన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

### ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శిగా ప్రభాకర్



ఎస్‌జీఎఫ్ సెక్రటరీగా నియామక పత్రాన్ని అందుకుంటున్న ప్రభాకర్

సిరిసిల్లఎడ్యుకేషన్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా(ఎస్‌జీఎఫ్) జిల్లా కార్యదర్శిగా సిరిసిల్లలోని కుసుమ రామయ్య బాలుర ఉన్నత పాఠశాలలో ఫిజికల్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న దేవత ప్రభాకర్‌ను నియమించినట్లు డీఈవో రమేశ్ తెలిపారు. విద్యార్థులు క్రీడల్లో రాణించేలా కృషి చేయాలని సూచించారు. ప్రభాకర్‌ను డీవైఎస్‌ఓ రాందాస్, ఉపాధ్యాయ సంఘాల నాయకులు పాతూరి మహేందర్‌రెడ్డి, పాకాల శంకర్‌గౌడ్ అభినందించారు.

# నోట్‌బుక్కులు రాలె!

- ఈ ఏడాది విద్యార్థులకు నోట్‌బుక్కులు ఉచితం
- 6–12 తరగతులకు నిధులు మంజూరు చేసిన ప్రభుత్వం
- ట్రాన్స్‌పోర్టు కోసం కూడా విడుదలైన డబ్బులు
- ఉమ్మడి జిల్లాలో ఏ పాఠశాలకూ అందని నోట్‌బుక్కులు
- సమీపిస్తున్న ఫార్మాటివ్ అసెస్‌మెంట్ పరీక్షలు

| జిల్లా | అందాల్సిన నోట్‌బుక్కులు |
|---|---|
| కరీంనగర్ | 2,66,121 |
| జగిత్యాల | 3,88,730 |
| పెద్దపల్లి | 2,10,618 |
| రాజన్న సిరిసిల్ల | 2,41,712 |



| జిల్లా | పాఠశాలలు | ఉపాధ్యాయులు | విద్యార్థులు |
|---|---|---|---|
| కరీంనగర్ | 623 | 2,787 | 36,775 |
| జగిత్యాల | 748 | 3,915 | 65,632 |
| పెద్దపల్లి | 580 | 2,423 | 45,626 |
| రాజన్న సిరిసిల్ల | 510 | 2,651 | 37,803 |

(నోట్: ఈ గణాంకాలకు గురుకుల, కేజీబీవీ, మోడల్ స్కూళ్లు అదనం)

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: ప్రభుత్వం ఈఏడాది విద్యార్థుల కోసం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన ఉచిత నోట్‌బుక్కుల పంపిణీ ఇంకా అమలుకు నోచుకోలేదు. తెలంగాణ సమగ్రశిక్ష కింద.. ఆరో తరగతి నుంచి 12వ తరగతి వరకు అన్ని ప్రభుత్వ, స్థానిక సంస్థల, కేజీబీవీ, గురుకుల, మోడల్ స్కూళ్లలో అందజేసేందుకు ఏర్పాట్లు చేసేందుకు సిద్ధపడింది. సాధారణంగా ప్రభుత్వం నుంచి సహకారం లేకపోవడం, నిధులు విడుదల కాకపోవడం, క్షేత్రస్థాయిలో అధికారుల నిర్లక్ష్యం తదితర కారణాలతో ప్రభుత్వ పథకాలు అమలుకు నోచుకోవు. కానీ.. విచిత్రంగా ఈ విషయంలో మాత్రం ప్రభుత్వం నుంచి నిధుల కేటాయింపు పూర్తయింది. అంతేకాదు నోటుబుక్కులు రాష్ట్రంలోని అన్ని జిల్లాల పాఠశాలలను చేరేందుకు కావాల్సిన రవాణాచార్జీలు కూడా కేటాయించింది. అయినప్పటికీ నేటికీ అందకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.

**సమీపిస్తున్న ఫార్మాటివ్ అసెస్‌మెంట్**

వాస్తవానికి ఈవిద్యా సంవత్సరం 2023–24లో భాగంగా గతనెల జూన్ 2వ తేదీ నుంచి సర్కారు పాఠశాలల్లో ప్రవేశాలు మొదలయ్యాయి. తొలి పది రోజులు తెలంగాణ దశాబ్ది వేడుకలే జరిగాయి. అనంతరం పాఠ్యపుస్తకాలు కూడా పాఠశాలలకు చేరుకోవడంతో ఉపాధ్యాయులు పాఠాలు మొదలుపెట్టారు. ఈ ఏడాది నోటుబుక్కులు కొనుక్కోనవసరం లేదని అన్ని స్కూళ్లలో ముందే విద్యార్థులకు చెప్పడంతో వారంతా కొనలేదు. కానీ.. హైస్కూల్ విద్యార్థులకు ముఖ్యంగా 10వ తరగతి విద్యార్థులకు నోటు బుక్కులు చాలా కీలకం. అందులోనూ ఫార్మాటివ్ అసెస్‌మెంట్–1 పరీక్షలు త్వరలో జరగనున్నాయి. ఈ నేపథ్యంలో టీచర్లు బోధించిన పాఠాలు రాసుకునేందుకు చాలామంది నోట్‌బుక్కులు కరవయ్యాయి. వాస్తవానికి నోట్‌బుక్కుల్లో జాప్యంతో ఇప్పటికే కొన్నిచోట్ల విద్యార్థులు కొనుక్కుని వస్తున్నారు. అదేసమయంలో పేద విద్యార్థులు మాత్రం ప్రభుత్వంపై ఆశతో ఉన్నారు.

**ఏ విద్యార్థికి ఎన్ని నోట్‌బుక్కులు?**

ప్రతీ హైస్కూలు విద్యార్థికి తరగతి గదిలో చెప్పే పాఠాలను నోట్ చేసేకునేందుకు 6వ తరగతి నుంచి 12వ తరగతి వరకు అందరికీ ఉచిత 200 పేజీల నోట్‌బుక్కులు ఈవిద్యా సంవత్సరం నుంచి ×తెలంగాణ సమగ్ర శిక్ష¥ కింద ఇచ్చేందుకు విద్యాశాఖ రంగం సిద్ధం చేసింది. ఇప్పటికే ఈ మేరకు 33 జిల్లాల విద్యాశాఖాధికారు (డీఈవో)లకు సమాచారాన్ని గత జూన్ 6వ తేదీన చేరవేసింది. 6వ, 7వ తరగతి విద్యార్థులకు 6 నోట్ బుక్కుల చొప్పున, 8వ తరగతికి 7 బుక్కులు, 9వ, 10వ తరగతులకి 14 నోట్ బుక్కులు, 11వ, 12వ తరగతులు (ఎంపీసీ, సీఈసీ, బైపీసీ తదితరాలు) 12 నోట్‌బుక్కులు ఇవ్వాలని స్కూల్ ఎడ్యుకేషన్, డైరెక్టర్ వెల్లడించారు. 33 జిల్లాల డీఈవోలు ఈ నోట్‌బుక్కులను అన్ని మండలాలకు పంపాలని, అక్కడి నుంచి ఎంఈవోలు పాఠశాలలకు తరలించాలని సూచించారు. ఈ క్రమంలో ఎక్కడ నోట్‌బుక్కుల కొరత ఏర్పడినా ఉన్నతాధికారులకు వెంటనే తెలియజేయాలని స్పష్టంచేశారు.

**నిధుల విడుదలైనా..**

నోట్‌బుక్కుల రవాణా కింద ప్రతీ పాఠశాలకు నిధులు కేటాయించింది. జిల్లాకు రూ.2 లక్షల చొప్పున ఇస్తూ ఆదేశాలు జారీచేసింది. ఇందులో రూ.48,000 ఎస్సీ, రూ.28,000 ఎస్టీ కంపోనెంట్లుగా మిగిలిన రూ.1,24,000 జనరల్ కంపోనెంట్‌గా పేర్కొంది. ఈలెక్కన ఉమ్మడి జిల్లాకు రవాణా కింద రూ.8 లక్షలు వస్తాయన్నమాట. అయితే, ఆదేశాలు వచ్చినప్పటికీ.. ఇంకా ఈ నోట్‌బుక్కులు జిల్లాలకు చేరుకోకపోవడంతో డీఈవోలు, ఎంఈవోలు, హెడ్మాస్టర్లు విద్యార్థులకు ఏమీ చెప్పలేకపోతున్నారు.

# ప్రజా'వాణి' వినండి సార్లూ..

- కలెక్టరేట్‌లో బారులు తీరిన బాధితులు
- సమస్యలు పరిష్కరించాలని వేడుకోలు
- వివిధ సమస్యలపై 60 దరఖాస్తులు



అర్జీలు స్వీకరిస్తున్న అడిషనల్ కలెక్టర్లు

సిరిసిల్లఅర్బన్: క్షేత్రస్థాయిలో సమస్యలు పరిష్కారం కాకపోవడంతో పలువురు బాధితులు కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి తరలివచ్చారు. తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అర్జీలు అందించారు. బాధితులతో కలెక్టరేట్ ప్రాంగణం కిటకిటలాడింది. తమ సమస్యలకు పరిష్కారాలు చూపాలంటూ అడిషనల్ కలెక్టర్లు బి.సత్యప్రసాద్, ఖీమ్యానాయక్‌లకు మొరపెట్టుకున్నారు. ప్రజావాణికి మొత్తం 60 దరఖాస్తులు వచ్చాయి. డీఆర్వో శ్రీనివాస్‌రావు, వేములవాడ ఆర్డీవో పవన్‌కుమార్, పలు శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

### పెన్షన్ డబ్బులు ఇవ్వడం లేదు



నాకు ముస్తాబాద్‌లో ఎస్‌బీఐ బ్రాంచ్‌లో ప్రతి నెల వృద్ధాప్య పెన్షన్ డబ్బులు జమవుతాయి. రెండు నెలలుగా బ్యాంక్ అధికారులు పెన్షన్ డబ్బులు ఇవ్వకుండా అకౌంట్ లాక్ చేశారు. అడిగితే క్రాప్‌లోన్ ఉందంటున్నారు. నా కొడుకులు నా పేరు మీద లోన్ తీసుకున్నారు. నేను, నా భార్య పెన్షన్ డబ్బులపై ఆధారపడి బతుకుతున్నాం. దయచేసి పెన్షన్ డబ్బులు వచ్చేలా చూడాలి.

– గుగులోత్ లక్ష్మణ్‌నాయక్, ముస్తాబాద్

### విధుల్లోకి తీసుకోవాలి



నేరెళ్లలోని టీఎస్‌ఆర్‌ఎస్ గురుకుల పాఠశాలలో 2015 నుంచి టైపిస్టుగా పనిచేస్తున్నాను. టీఎస్‌ఆర్‌ఎస్ గురుకుల సెక్రటరీ ఆదేశాలతో నాన్ టీచింగ్ స్టాఫ్ ముగ్గురు ఉండాలనే ప్రతిపాదించడంతో నన్ను డిసెంబర్‌లో విధుల్లో నుంచి తొలగించారు. తిరిగి విధుల్లోకి తీసుకోవాలని గురుకుల సెక్రటరీ నుంచి ఇటీవల ప్రొసీడింగ్ జారీ చేశారు. నా భర్తకు ఇటీవల ఆపరేషన్ జరిగింది. ఆర్థిక ఇబ్బందులు పడుతున్నాం. అధికారులు మానవతా దృక్పథంతో తిరిగి విధుల్లోకి తీసుకోవాలి.

– సుధారాణి

### కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలి



ముస్తాబాద్ మండలం కొండాపూర్‌లో 6–86 ఇంటి నంబర్ గల ఖాళీ స్థలం ఉంది. ఈ స్థలంపై శ్రీని వాస్‌కు మాకు 2014 నుంచి కోర్టు పరిధిలో కేసు నడుస్తోంది. నేను స్థానికంగా లేకపోవడంతో ఆ స్థలా న్ని గ్రామ కార్యదర్శి శ్రీనివాస్‌కు మ్యూటేషన్ చేశాడు. శ్రీనివాస్ మరొకరికి అమ్ముకున్నాడు. ఇదేంటని గ్రామకార్యదర్శిని ప్రశ్నిస్తే బెదిరింపులకు గురిచేస్తున్నాడు. తప్పుడు నంబర్ సృష్టించి స్థలం దురాక్రమణం చేసిన కార్యదర్శి, దానికి సంబంధించిన బాధ్యులపై చర్యలు తీసుకోవాలి.

– తుపాకుల వసంత, కొండాపూర్

### పరిహారం చెల్లించాలి



మేము వేములవాడ మున్సిపల్ పరిధి నాంపల్లి గ్రామస్తులం. కొత్తపల్లి–మనోహరాబాద్ రైల్వేలైన్‌లో భూములను కోల్పోతున్నాం. రైల్వేలైన్‌లో భూములు కోల్పోతున్న మాకు పరిహారం అందించాలి. ఎకరాకు కోటి రూపాయలు, ఇళ్ల స్థలాలకు గుంటకు రూ.10లక్షలు చెల్లించి న్యాయం చేయాలి.

– రైల్వేలైన్ భూ నిర్వాసితులు

### ఉద్యోగ భద్రత కల్పించండి



ఆదర్శ పాఠశాలలో గంటల ప్రాతిపదికన పనిచేసే ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి. నెలలో దాదాపు 150 గంటలు పనిచే స్తున్నప్పటికీ ప్రభుత్వం 100 గంటలకు మాత్రమే వేతనం చెల్లిస్తుంది. సమాన పనికి సమాన వేతనం చెల్లించి, ఉద్యోగ భద్రత కల్పించాలి.

– మోడల్‌స్కూల్ హెచ్‌బీటీలు

## చెక్‌డ్యామ్ నిర్మాణాలు పూర్తి చేయాలి

- 24 చెక్‌డ్యాములకు రూ.155 కోట్లు
- అదనపు కలెక్టర్ ఎన్.ఖీమ్యానాయక్



అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్

సిరిసిల్ల: జిల్లాలోని చెక్‌డ్యామ్‌లను వేగంగా పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ ఎన్.ఖీమ్యానాయక్ కోరారు. కలెక్టరేట్‌లో సోమవారం ఇరిగేషన్‌శాఖ ఇంజినీర్లతో చెక్‌డ్యామ్ నిర్మాణాలపై సమీక్షించారు. మానేరువాగుపై 11, మూలవాగుపై 13 చెక్‌డ్యామ్ నిర్మాణాలకు రూ.155కోట్లు మంజూరైనట్లు తెలిపారు. నర్మాల ఎగువ మానేరు నుంచి మధ్య మానేరు జలాశయం వరకు మానేరువాగుపై 11 చెక్‌డ్యామ్‌ల్లో మూడు మాత్రమే పూర్తయ్యాయని, మిగతా 9 చెక్‌డ్యామ్‌లను అక్టోబర్ నెలాఖరులోగా పూర్తి చేయాలని సూచించారు. వేములవాడ మూల వాగుపై 13 చెక్‌డ్యామ్‌ల్లో ఇప్పటికే 9 పూర్తయ్యాయని, ప్రగతిలో ఉన్న నాలుగింటిలో నెలాఖరులోగా రెండు, ఇంకో రెండింటిని అక్టోబర్‌లోగా పూర్తి చేయాలని ఆదేశించారు. చెక్‌డ్యామ్‌ల నిర్మాణంలో నాణ్యతలోపం లేకుండా, పనులు వేగంగా జరిపించాలన్నారు. మానేరు, మూలవాగులు జలాలతో నిండుగా ఉంచాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఇరిగేషన్ ఈఈ అమరేందర్‌రెడ్డి, 9వప్యాకేజీ ఈఈ శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

## ఆధునికీకరణతోనే వస్త్రపరిశ్రమకు మనుగడ

- సిరిసిల్ల వస్త్రోత్పత్తిదారులు
- సూరత్‌లో మరమగ్గాల ఎక్స్‌పో సందర్శన



మరమగ్గాలను పరిశీలిస్తున్న వస్త్రోత్పత్తిదారులు

సిరిసిల్ల: ఆధునిక మరమగ్గాల ఏర్పాటుతో వస్త్రపరిశ్రమ మనుగడ సాధ్యమని సిరిసిల్ల వస్త్రోత్పత్తిదారులు పేర్కొన్నారు. సూరత్, బెంగళూర్ తరహాలో వీవింగ్ పార్క్‌లో స్థలాలు కేటాయిస్తే ఆధునిక మగ్గాలను నెలకొల్పుతామని అభిప్రాయపడ్డారు. గుజరాత్‌లోని సూరత్‌లో అంతర్జాతీయ మరమగ్గాల ఎక్స్‌పో ప్రదర్శనకు వేముల దామోదర్, అలువాల ఉదయ్, బైరి మధు, వెలిశెట్టి సాగర్ వెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. టెక్స్‌టైల్ పార్క్ తరహాలో సిరిసిల్ల అపెరల్ పార్క్‌లో ప్రభుత్వ స్థలాన్ని కేటాయించి, మౌలిక వసతులు కల్పిస్తే ఆధునిక మగ్గాలను ఏర్పాటు చేసుకునే వీలుందన్నారు. సెమీ ఆటోమేటిక్ లూమ్స్, ఆధునిక జకార్డ్ మిషన్లు అమర్చుకుని నాణ్యమైన వస్త్రాల తయారీకి అవకాశం ఉందని అభిప్రాయపడ్డారు. సూరత్, బెంగళూరు తరహాలో సొంతంగానే మార్కెటింగ్ చేసుకుంటూ.. నాణ్యమైన వస్త్రాలతో ప్రపంచంతో పోటీపడవచ్చన్నారు. రాష్ట్ర ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి కేటీఆర్ సిరిసిల్లలో వీవింగ్ పార్క్‌లో స్థలాలను కేటాయించేలా దృష్టి సారించాలని వేముల దామోదర్ కోరారు.

### కుక్కలకు కుటుంబ నియంత్రణ



సిరిసిల్ల: జిల్లా కేంద్రంలో ఇటీవల కుక్కల బెడద తీవ్రమైంది. స్థానికుల ఫిర్యాదులతో మున్సిపల్ అధికారులు స్పందించారు. కుక్కలకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేయాలని నిర్ణయించారు. ఈమేరకు సిరిసిల్లలో సంచరిస్తున్న వీధికుక్కలను సోమవారం బంధించి తీసుకెళ్తున్నారు. ఒక్కో కుక్కకు రూ.600 చెల్లించేందుకు కాకినాడకు చెందిన కుక్కలను పట్టే బృందంతో ఒప్పందం చేసుకున్నారు. ఇలా పట్టుకెళ్లిన కుక్కలకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేస్తున్నారు.

### రోడ్డు కోసం భిక్షాటన



సిరిసిల్లఅర్బన్: గంభీరావుపేట మండలం కొత్తపల్లి ఎల్లమ్మ గుడి నుంచి శివాజీనగర్ వరకు రోడ్డు వేయాలని అఖిలపక్షం నాయకులు సోమవారం సిరిసిల్లలో భిక్షాటన చేపట్టారు. వారు మాట్లాడుతూ కొత్తపల్లిలో రోడ్డు గుంతలమయంగా మారిందని పలుమార్లు కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదన్నారు. రోడ్డు గుంతలు పూడ్చేందుకు భిక్షాటన చేస్తున్నట్లు పేర్కొన్నారు. శివసేన పార్టీ యూత్ రాష్ట్ర అధ్యక్షుడు గణేశ్, పర్శాగౌడ్, కేకే మహేందర్ యువసేన అధ్యక్షుడు మహేశ్, కాంగ్రెస్ యూత్ సెక్రటరీ రాజు, రమేశ్, వెంకటేశ్, శ్రీనివాస్‌రెడ్డి, అజయ్, శ్యామ్‌సుందర్ పాల్గొన్నారు.

### ఫోర్‌లేన్ రోడ్డుకు రూ.30కోట్లు మంజూరు

గంభీరావుపేట(సిరిసిల్ల): గంభీరావుపేటలో ఫోర్‌లేన్ రోడ్డు నిర్మాణం, రోడ్డు విస్తరణకు రాష్ట్ర ప్రభుత్వం రూ.30కోట్లు మంజూరు చేసింది. ఈమేరకు సోమవారం మంజూరు ఉత్తర్వులను ప్రభుత్వం జారీచేసింది. మండలంలోని పెద్దమ్మ స్టేజీ నుంచి లింగన్నపేట రోడ్డు వరకు దాదాపు మూడు కిలోమీటర్ల రోడ్డును రవాణా, ఆర్‌అండ్‌బీ ఆధ్వర్యంలో ఫోర్‌లేన్‌గా మార్చనున్నారు. నిధుల మంజూరుపై ప్రజలు, నాయకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

### నేడు జిల్లా ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశం

సిరిసిల్ల: జిల్లా ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశం మంగళవారం జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ అధ్యక్షతన నిర్వహిస్తున్నారు. జిల్లా ఆస్పత్రిలో ఉదయం 11 గంటలకు జరిగే ఈ సమావేశంలో ఆస్పత్రి అభివృద్ధిపై సమీక్షించనున్నారు. జిల్లా ఆస్పత్రి పర్యవేక్షకులు, వైద్యులు హాజరుకానున్నారు.

### జిల్లాలో చినుకే లేదు

సిరిసిల్ల: జిల్లాలో సోమవారం చినుకే లేదు. సిరిసిల్లలో 3.0 మిల్లీమీటర్ల వర్షం పడగా.. వేములవాడ రూరల్‌లో 0.3, గంభీరావుపేటలో 0.7, ఇల్లంతకుంటలో 0.1 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. ఇక మిగతా తొమ్మిది మండలాల్లో చుక్క వాన పడలేదు. జిల్లాలో 44 శాతం లోటు వర్షం నమోదైంది.

## ముంపు గ్రామాల సమస్యలు పరిష్కరించండి

- వేములవాడ ఎమ్మెల్యే రమేశ్‌బాబు



రజత్‌కుమార్‌తో సమావేశమైన ఎమ్మెల్యే రమేశ్‌బాబు

వేములవాడ: మధ్యమానేరులో సర్వస్వం కోల్పోయిన నిర్వాసితులకు రావాల్సిన రూ.42 కోట్లు విడుదల చేసి, సమస్యలు పరిష్కరించాలని వేములవాడ ఎమ్మెల్యే రమేశ్‌బాబు కోరారు. హైదరాబాద్‌లోని సెక్రటేరియట్‌లో సోమవారం రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్, రాష్ట్ర నీటిపారుదలశాఖ ముఖ్యకార్యదర్శి రజత్‌కుమార్‌తో చర్చించారు. నిర్వాసిత గ్రామాల సమస్యలు పరిష్కరించి, నిర్వాసితులకు ఉపాధిమార్గాలు చూపాలని కోరారు. జెడ్పీటీసీ మ్యాకల రవి, సెస్ డైరెక్టర్ చరణ్‌రావు, వైస్‌ఎంపీపీ ఆర్సీరావు, బూర బాబు, ఎర్రం రవీందర్, అనుపురం సర్పంచ్ వెంకటరమణారావు తదితరులు పాల్గొన్నారు.

**ఎల్లంపల్లి పెండింగ్ పనులు పూర్తి చేయండి**

చందుర్తి(వేములవాడ): వేములవాడ నియోజకవర్గంలోని ఎల్లంపల్లి ప్రాజెక్టు పెండింగ్ పనులను పూర్తి చేయాలని నీటిపారుదల శాఖ ప్రధాన కార్యదర్శి రజత్‌కుమార్‌కు స్థానిక ఎమ్మెల్యే రమేశ్‌బాబు, రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్, నీటిపారుదల శాఖ విశ్రాంతి ఎస్ఈ ఉప్పుగంటి గోవిందరావు కోరారు. కలికోట, సూరమ్మ చెరువులు, కోనరావుపేట మండలం బావుసాయిపేటలో కాలువ పనుల పూర్తి చేయించాలని కోరారు.

## మాయలేడి అరెస్టు

- వృద్ధ మహిళలే లక్ష్యంగా మోసాలు
- 38 గ్రాముల బంగారం, 8 తులాల వెండి స్వాధీనం



వివరాలు తెలుపుతున్న సీఐ, ఎస్సైలు

ముస్తాబాద్(సిరిసిల్ల): వృద్ధ మహిళలే లక్ష్యంగా మోసాలకు పాల్పడుతున్న మాయలేడి ఆటలను పోలీసులు కట్టడి చేశారు. నమ్మించి మాయమాటలు చెప్పి ఒంటిమీద నగలను దోపిడీ చేస్తున్న కిలేడీని ముస్తాబాద్ పోలీసులు అరెస్ట్ చేశారు. ముస్తాబాద్ పోలీస్‌స్టేషన్‌లో సోమవారం సిరిసిల్లరూరల్ సీఐ ఉపేందర్ సోమవారం వివరాలు వెల్లడించారు. మండలంలోని నామాపూర్‌కు చెందిన వృద్ధురాలు జంగిటి బాలవ్వ మే 9వ తేదీన ఇంట్లో ఒంటరిగా ఉండడం గమనించి ఆమెకు కల్లు తాగించి మెడలోని బంగారు, వెండి ఆభరణాలను ఎత్తుకెళ్లారు. ఈనెల 3న పోతుగల్‌కు చెందిన వృద్ధురాలు మర్రిపెల్లి నర్సవ్వ రైతుబంధు డబ్బుల కోసం ముస్తాబాద్‌లోని బ్యాంక్‌కు వచ్చింది. దాహం ఉందని నర్సవ్వ తెలపడంతో మాటువేసిన మాయలేడి ఆమెకు కల్లు తాగించింది. మత్తులోకి వెళ్లిన నర్సవ్వ మెడలోని బంగారు, వెండి ఆభరణాలను ఎత్తుకెళ్లింది. వరుస చోరీలు ఒకేరకంగా జరగడంతో సవాల్‌గా తీసుకున్న ఎస్సై వెంకటేశ్వర్లు దొంగల కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. సీసీ కెమెరాలను పరిశీలించి, విచారణ చేపట్టారు. ఈనేపథ్యంలో ముస్తాబాద్ బస్టాండ్ వద్ద సోమవారం తనిఖీలు చేపట్టారు. అనుమానాస్పదంగా సంచరిస్తున్న మహిళను ప్రశ్నించగా పొంతన లేని సమాధానాలు చెప్పడంతో అదుపులోకి తీసుకుని విచారించారు. గంభీరావుపేటకు చెందిన పాటి సునీత (49)గా గుర్తించారు. వరుస చోరీలకు పాల్పడుతూ, కల్లు తాగించి మత్తులో ముంచుతూ వృద్ధులను దోచుకుంటున్న సునీత నుంచి బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. సునీతను రిమాండ్‌కు తరలించామని సీఐ ఉపేందర్ తెలిపారు.

**సులభంగా సంపాదించాలని..**

గంభీరావుపేటకు చెందిన సునీత సులభంగా సంపాదించాలనే లక్ష్యంతో చోరీలకు పాల్పడుతోందని సీఐ తెలిపారు. పంటలు పండక, తీవ్రంగా నష్టపోయిన సునీతకు అప్పులు తీర్చే మార్గం కనిపించలేదని వివరించారు. ట్రాక్టర్ రుణాలు బ్యాంక్‌లో కట్టకపోవడంతో మనోవేదనకు గురైందని సీఐ తెలిపారు. ఎలాగైన డబ్బు సంపాదించాలనే లక్ష్యంతో మత్తు కలిపిన కల్లుతో ఒంటరిగా ఉన్న మహిళలే లక్ష్యంగా సునీత చోరీలకు పాల్పడిందన్నారు. ప్రజలు అపరిచితులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. గుర్తుతెలియని వ్యక్తులు ఇచ్చే పానియాలు, ఆహార పదార్థాలను తీసుకోవద్దని సూచించారు. సీసీ కెమెరాలతో మహిళ దొంగను అరెస్టు చేసినట్లు తెలిపారు. ఎస్సై వెంకటేశ్వర్లు, కానిస్టేబుళ్లను సీఐ అభినందించారు.

## క్లుప్తంగా

### రాజన్న హుండీ లెక్కింపు

వేములవాడ: రాజన్న హుండీ లెక్కింపును ఈనెల 12, 13 తేదీల్లో నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో కృష్ణప్రసాద్ సోమవారం ప్రకటనలో తెలిపారు. ఆలయ అధికారులు, సిబ్బంది ఉదయం 8 గంటలకే ఓపెన్‌స్లాబ్ వద్దకు చేరుకోవాలని ఆదేశించారు.

### టిప్పర్ సీజ్



మైనింగ్ అధికారులు పట్టుకున్న టిప్పర్

సిరిసిల్ల: అక్రమంగా మట్టిని తరలిస్తున్న టిప్పర్‌ను సీజ్ చేసినట్లు మైనింగ్ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ సైదులు సోమవారం తెలిపారు. వేములవాడ అర్బన్ మండలం అగ్రహారం నుంచి అనుమతి లేకుండా మట్టిని తరలిస్తున్న టిప్పర్‌ను సీజ్ చేసి, వేములవాడ ఆర్టీసీ డిపోకు తరలించినట్లు తెలిపారు. జిల్లాలో అక్రమ మట్టి తరలించే ఎంతటి వారినైనా ఉపేక్షించబోమని స్పష్టం చేశారు.

### గిరిజన మహిళా కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు

తంగళ్లపల్లి (సిరిసిల్ల): తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో డిగ్రీ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలకు స్పాట్ అడ్మిషన్స్ నిర్వహిస్తున్నట్లు ఆర్‌సీవో డీఎస్. వెంకన్న, ప్రిన్సిపాల్ కె.రజిని ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలలో బీఎస్సీ ఫిజికల్ సైన్స్, బీఎస్సీ లైఫ్, బీఏ, బీకాం (కంప్యూటర్ అప్లికేషన్స్) కోర్సులు ఉన్నట్లు తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు ఈనెల 20వ తేదీలోపు దరఖాస్తులు చేసుకోవాలని కోరారు.

### రోడ్డు ప్రమాదంలో గాయపడిన సుంకరి

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండలంలోని రాచర్ల గొల్లపల్లి శివారులోని సత్తెపీరీల దర్గా వద్ద జరిగిన ప్రమాదంలో ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. గంభీరావుపేట మండలంలోని గజసింగవరం గ్రామానికి చెందిన సుంకరి పంతం రాజనర్సు వ్యక్తిగత పనుల మీద సోమవారం గొల్లపల్లికి వచ్చి తిరిగి వెళ్తున్నాడు. ఈక్రమంలో సత్తెపీరీల దర్గా వద్దకు చేరుకోగానే పల్సర్ బైక్‌పై వేగంగా వస్తున్న యువకులు రాజనర్సు ప్రయాణిస్తున్న ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టారు. ప్రమాదానికి కారణమైన వారు పరారయ్యారు. తీవ్రంగా గాయపడిన రాజనర్సును అటు వైపు వెళ్తున్న ప్రయాణికులు 108 వాహనంలో ఆస్పత్రికి తరలించారు. అదేవిధంగా ఎల్లారెడ్డిపేట ఎస్సైకి ఫోన్ ద్వారా సమాచారం అందించారు. పల్సర్‌బైక్‌కు సంబంధించిన హెడ్‌లైట్ వైజర్ సంఘటన స్థలంలోనే పడిపోయింది.

# అడవంతా పండుగ

- శీత్లాభవాని వేడుకలకు ముస్తాబైన తండాలు
- అమ్మవారి గద్దెలకు రంగులు
- ప్రకృతి ఆరాధనలో గిరిజనులు



అమ్మవారి గద్దెల ముస్తాబు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): అడవి బిడ్డల పండుగ శీత్లాభవాని వేడుకలకు జిల్లాలోని తండాలు ముస్తాబయ్యాయి. ముఖ్యంగా ఆడబిడ్డల పండుగ కావడంతో తండాలు సందడిగా మారాయి. యువతులు మంచి వరుడుకావాలని శీత్లాభవానికి మొక్కులు చెల్లించడం ఈ పండుగ ప్రత్యేకత. ఏటా వర్షాకాలం ఆరంభమై పెద్దపూసల కార్తీలో నిర్వహించుకోవడం ఆనవాయితీ. జూలై తొలి, రెండో మంగళవారాల్లో ఈ పండుగను నిర్వహిస్తారు. జిల్లాలోని 128 తండాల్లో ఒకే రోజు ఈనెల 11న శీత్లాభవాని వేడుకలు నిర్వహించాలని జిల్లా బంజారా సేవా సంఘం ప్రతినిధులు నిర్ణయించారు.

**దాటుడు పండుగ**

తండాల పోలిమేరల వద్ద శీత్లాభవానిని ప్రతిష్ఠించి యువతులు బోనాలతో అక్కడికి చేరుకుంటారు. కోళ్లు, మేకలు, గొర్రెలను బలిచ్చి మొక్కులు చెల్లించుకుంటారు. పశువులన్నింటిని ఒక చోట చేర్చి బలిచ్చిన మేక మీదుగా వాటిని దాటిస్తారు. బావి నుంచి తెచ్చిన నీటిని వాటిపై చల్లుతారు. ఆ కారణంగానే దీనికి దాటుడు పండుగగా పేరొచ్చింది.

**నైవేద్యాలతో అటవీప్రాంతానికి..**

పండుగ రోజు ఉదయం నైవేద్యాలతో ఊరేగింపుగా అటవీప్రాంతానికి తరలివెళ్తారు. అక్కడ శీత్లాభవాని, తుల్జాభవాని, మసూరిభవాని, అంబభవాని, దుర్గా భవాని మాతలకు మొక్కులు చెల్లించుకుంటారు. పిల్లపాపలు, పశుసంపద బాగుండాలని, పంటలు సమృద్ధిగా పండాలని కోరుతూ పూజలు చేస్తారు. ఈ సందర్భంగా గిరిజన మహిళల నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి. పెళ్లికాని యువతులు మంచి వరుడు దొరకాలని పూజలు చేస్తారు.

**తండాలలో సందడి**

ఉద్యోగం, వ్యాపార రీత్య పట్టణాలు, దూర ప్రాంతాల్లో స్థిరపడ్డ వారంతా శీత్లాభవాని వేడుకల కోసం జిల్లాలో వారి స్వస్థలాలకు చేరుకున్నారు. వీరి రాకతో తండాలలో సందడి నెలకొంది. పండుగ రోజు జిల్లా వ్యాప్తంగా సెలవు ప్రకటించాలని బంజారా సంఘం నాయకుడు అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్‌ను సోమవారం కలిసి వినతిపత్రం అందించారు.

**మంచి వరుడు దొరకాలని..**



శీత్లాభవానికి నిష్టతో పూజలు చేస్తే మంచి వరుడు దొరుకుతాడనే నమ్మకం. పెద్దలు చెప్పిన విధంగా అమ్మవారికి ఉపవాసంతో నైవేద్యాలు తీసుకెళ్లి సమర్పిస్తాం. కోరికలు తీర్చే తల్లి భవానిదేవి.

– మానస, రాచర్ల గుండారం

**కోరికలు నెరవేరుతాయి**



శీత్లాభవాని అమ్మవారిని కొలి స్తే కోరికలు నెరవేరుతాయి. పాడి, పశుసంపద, పంటలు, ఆయురారోగ్యాలతో ఉండాలని అమ్మవారిని కొలుస్తాం. అమ్మవారికి పిండి నైవేద్యాలను ఊరేగింపుగా తీసుకెళ్లి సమర్పిస్తాం. ఏటా ఇదే మాసంలో పండుగ జరుపుకుంటాం.

– అజ్మీరా రజిత, సర్పంచ్, బుగ్గ రాజేశ్వర తండా

**ఒకే రోజు జరుపుకోవాలని నిర్ణయించాం**



జిల్లా వ్యాప్తంగా ఉన్న తండాలలో ఒకే రోజు శీత్లాభవాని వేడుకలు నిర్వహించుకోవాలని నిర్ణయించాం. గతంలో రెండు వారాలపాటు ఈ పండుగను జరుపుకునేవారు. ఈ ఏడాది మాత్రం ఈనెల 11న అన్ని తండాల్లో అమ్మవారి పండుగ జరుపుకుంటున్నాం.

– అజ్మీరా రాజునాయక్, బంజారా సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు



## రైతుకు సన్మానం

ముస్తాబాద్: మండలం గూడెం గ్రామానికి చెందిన బొంపెల్లి రఘుపతిరావును అనే రైతును సోమవారం ఘనంగా సన్మానించారు. రఘుపతి రావు పాల ఉత్పత్తిదారుల సహకార సంఘానికి చైర్మన్‌గా పనిచేశారని, గ్రామీణ బ్యాంక్, పాల ఉత్పత్తిదారుల సేవా కేంద్రం నిర్మించారని రైతులు పేర్కొన్నారు. గూడెంలో రికార్డుస్థాయిలో పాల ఉత్పత్తి జరగడానికి కృషిచేశారన్నారు. చైర్మన్ అందె శ్రీనివాస్ అన్నారు. తెలంగాణ గ్రామీణ బ్యాంక్ మేనేజర్ చంద్రశేఖర్, రైతులు బొప్ప మల్లయ్య, ప్రసాద్, రవీందర్, తిరుపతి, విష్ణు, కిషన్ రైతులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుల సర్దుబాటు

- ఉత్తర్వులు జారీ చేసిన డీఈవో

సాక్షి ఎఫెక్ట్

సిరిసిల్లఎడ్యుకేషన్ : జిల్లా ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయులను సర్దుబాటు చేశారు. విద్యార్థులు ఎక్కువగా ఉన్న పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత ఉందని, అసలు విద్యార్థులు లేని స్కూల్స్‌లో ఉపాధ్యాయులు ఎక్కువగా ఉన్నారని ఇలాంటి సమస్యలను సర్దుబాటు చేయడంలో జిల్లా విద్యాశాఖ అధికారులు సమన్వయం కొరవడినట్లు ఈనెల 7న 'విద్యాశాఖలో సమన్వయ లోపం' అనే శీర్షికన సాక్షిలో కథనం ప్రచురితమైంది. జిల్లాలో ఎన్నో పాఠశాలలో విద్యార్థులు లేరని, అలాగే ఎక్కువగా విద్యార్థులుండి ఉపాధ్యాయుల కోసం ఎస్ఎంసీ చైర్మన్లు, విద్యార్థులు తల్లిదండ్రుల నుంచి డిమాండ్ ఉండేది. దీనిని ఎంఈవోలు గమనించి నివేదికలను జిల్లా అధికారులకు అందించడంతో సోమవారం ఉపాధ్యాయులను సర్దుబాటు చేస్తూ జిల్లా విద్యాధికారి రమేశ్ ఉత్తర్వులు వెల్లడించారు. ఏదైనా పాఠశాలలో ఉపాధ్యాయులు కొరత ఉన్నట్లు భావిస్తే ప్రధానోపాధ్యాయుడు నేరుగా జిల్లా కార్యాలయానికి రాకుండా మండల విద్యాధికారికి నివేదించాలని, ఆ నివేదికల ఆధారంగా సర్దుబాటు చేయడం లేకపోతే ఉన్నతాధికారుల అనుమతితో విద్యా వలంటీర్లను నియమించేందుకు అవకాశం ఉంటుందని జిల్లా విద్యాశాఖ అధికారులు వెల్లడించారు. టీచర్ల కేటాయింపుకు సంబంధించిన వివరాలను మండల విద్యాధికారికి అందించినట్లు అధికారులు వెల్లడించారు.

# ట్రిపుల్ ఐటీ విద్యార్థినికి దాతల చేయూత



విద్యార్థినికి ఫిక్స్‌డ్ బాండ్‌ను అందజేస్తున్న దాతలు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండలంలోని వెంకటాపూర్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో చదువువుతున్న నిరుపేద విద్యార్థిని కెమ్మసారము తనుష్క, బాసర ట్రిపుల్‌ఐటీకి ఎంపిక కాగా దాతలు చేయూత అందజేశారు. కరీంనగర్‌కు చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ దాసరి శ్రీధర్ తనవంతుగా రూ.30 వేలు, నెల్లూరు జిల్లా అద్దంకికి చెందిన ఎన్నారై శ్రీకాంత్ రూ.20 వేలు కలిపి మొత్తం రూ.50 వేలను సహకార బ్యాంక్ ఆవునూరి శాఖ మేనేజర్ తనుష్క పేరుపై ఫిక్స్ చేసి బాండ్‌ను తల్లిదండ్రులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆర్థికసాయం అందజేసిన దాతలకు తనుష్కతో పాటు ఆమె తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు గొట్టిముక్కల శేఖర్, ఉపాధ్యాయులు ప్రేమ్‌సాగర్ పాల్గొన్నారు.

# లోతుచెరువు నుంచి నీటి విడుదల



నీటిని విడుదల చేస్తున్న అధికారులు,రైతులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండలంలోని బండలింగంపల్లి ఆయకట్టు భూములకు ఎగువమానేరు పరిధిలోని లోతుచెరువు వద్ద సోమవారం నీటిపారుదల శాఖ అధికారులు నీటిని విడుదల చేశారు. ఎగువమానేరు నుంచి లోతు చెరువులోకి అక్కడి నుంచి గ్రామ ఆయకట్టు భూములకు ఏటా సాగునీటిని అందిస్తారు. దాదాపు 200 ఎకరాల ఆయకట్టు సాగవుతుంది. డీఈఈ రవికుమార్, ఈఈ అమరేందర్ రెడ్డి, ఏఈఈలు, ఆయకట్టు రైతులు బాల్‌రాజ్ నర్సాగౌడ్, రాజమల్లారెడ్డి, రాంరెడ్డి, ఎల్లారెడ్డి, మార్పు శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# అమలుకు నోచుకోని ప్రభుత్వ హామీలు

- ఎన్నికలు వస్తుండటంతో తెరమీదకు బీసీ బంధు పథకం
- ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

గంగాధర: పోరాడి సాధించుకున్న తెలంగాణలో అన్నివర్గాల ప్రజలు ఇబ్బంది పడుతున్నారని, ప్రభుత్వ హామీలు అమలుకు నోచుకోవడం లేదని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ఆరోపించారు. గంగాధర మండలంలోని మధురానగర్ చౌరస్తాలో కాంగ్రెస్ నాయకుడు వొడ్నాల యగ్నేశ్ ఆధ్వర్యంలో, టీపీసీసీ అధికార ప్రతినిధి, నియోజకవర్గ ఇన్‌చార్జి మేడిపల్లి సత్యం సమక్షంలో సోమవారం పలువురు యువకులు పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్సీ మాట్లాడారు. రైతులకు చేస్తామన్న రూ.లక్ష రుణమాఫీ ఐదేళ్లు కావస్తున్నా పూర్తి కాలేదన్నారు. మద్దతు ధరతో ధాన్యం కొంటామని క్వింటాల్‌కు 10 కిలోలు దోచుకుంటున్నారని, రైతుబంధు పేరు చెప్పి, రైతుల సబ్సిడీలకు ఎగనామం పెట్టారని మండిపడ్డారు. 1.91 లక్షల ఉద్యోగాలు భర్తీ చేయడం లేదని, నిరుద్యోగ భృతి ఇవ్వడం లేదన్నారు. టీఎస్‌పీఎస్సీ అవినీతిమయం అయిందన్నారు. డబుల్ బెడ్రూం ఇళ్లు పంపిణీ చేసింది లేదని, ఇంటి నిర్మాణానికి రూ.3 లక్షలు ఇస్తామని ఏడాది గడిచినా ఇవ్వడం లేదని పేర్కొన్నారు. ఓట్ల కోసం తీసుకువచ్చిన దళితబంధు పథకం పూర్తిస్థాయిలో అమలు చేయలేదని, ప్రస్తుతం ఎన్నికలు వస్తుండటంతో బీసీ బంధు పథకాన్ని తెరమీదకు తెచ్చారన్నారు. కాంగ్రెస్‌కు అధికారం ఇవ్వాలని కోరారు. మేడిపల్లి సత్యం మాట్లాడుతూ.. తాను రెండుసార్లు ఇక్కడి నుంచి పోటీ చేసి, ఓడిపోయినా ప్రజలు, రైతుల సమస్యలపై పోరాటం చేస్తున్నానని అన్నారు. నాపై గెలిచిన బొడిగ శోభ, సుంకె రవిశంకర్‌లు ధనార్జనే ధ్యేయంగా పని చేశారని ఆరోపించారు. ఈసారి ఎన్నికల్లో తనను దీవిస్తే ప్రజాసేవకు అంకితమవుతానని పేర్కొన్నారు.

# జల్సాలకు అలవాటు పడి చోరీలు

- దొంగలిద్దరూ అన్నదమ్ములే
- అరెస్టు చేసిన పోలీసులు
- సుమారు రూ.5.40 లక్షల విలువైన ఆభరణాలు స్వాధీనం



దొంగల అరెస్టు చూపుతున్న పోలీసులు

కరీంనగర్‌క్రైం: జల్సాలకు అలవాటుపడి, దొంగతనాలు చేస్తున్న ఇద్దరిని కరీంనగర్ వన్ టౌన్ పోలీసులు పట్టుకున్నారు. వారి వద్ద నుంచి బంగారు, వెండి ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు. ఏసీపీ తుల శ్రీనివాసరావు వన్‌టౌన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. కొత్తపెల్లి మండలంలోని రేకుర్తి విజయపురి కాలనీకి చెందిన కుంచం అశోక్, అతని తమ్ముడు రవి జల్సాలకు అలవాటు పడ్డారు. సులువుగా డబ్బు సంపాదించేందుకు చోరీలు చేయాలనుకున్నారు. కరీంనగర్‌లో తాళం వేసి ఉన్న పలు ఇళ్లకు కన్నం వేసి, బంగారు, వెండి ఆభరణాలు, నగదు దొంగిలించారు. వరుస చోరీ ఘటనలను సవాల్‌గా తీసుకున్న పోలీసులు వన్ టౌన్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. ఆ దొంగల కదిలికలపై దృష్టిపెట్టి, సోమవారం చాకచక్యంగా పట్టుకున్నారు. వారి వద్ద నుంచి రూ.5.40 లక్షల విలువైన ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు. దొంగలను పట్టుకున్న పోలీసులను ఏసీపీ అభినందించారు.

# క్రీడా పాఠశాలల జిల్లాస్థాయి పోటీలు



మెడిసిన్ బాల్ త్రో పోటీని పరిశీలిస్తున్న డీవైఎస్ఓ రాజవీరు, తదితరులు

కరీంనగర్‌స్పోర్ట్స్: రాష్ట్రంలోని ప్రాంతీయ క్రీడా పాఠశాలల్లో 2023–24 విద్యాసంవత్సరంలో 4వ, 5వ తరగతుల్లో ప్రవేశానికి నిర్వహిస్తున్న జిల్లాస్థాయి ఎంపిక పోటీలు సోమవారం కరీంనగర్‌లోని అంబేడ్కర్ స్టేడియంలో ప్రారంభమయ్యాయి. 4వ తరగతిలో ప్రవేశం కోసం విద్యార్థులకు శారీరక సామర్థ్య పరీక్షలు నిర్వహించారు. అంతకుముందు ఈ పోటీలను జిల్లా క్రీడాశాఖ అధికారి కీర్తి రాజవీరు ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. 16 మండలాల నుంచి 40 మంది బాలబాలికలు హాజరైనట్లు తెలిపారు. జిల్లాస్థాయిలో అత్యధిక పాయింట్లు సాధించిన విద్యార్థులను రాష్ట్రస్థాయి పోటీలకు పంపించనున్నట్లు పేర్కొన్నారు. అనివార్య కారణాల వల్ల హాజరు కాలేకపోయిన విద్యార్థులు మంగళవారం రావొచ్చని చెప్పారు. పీడీలు రాజిరెడ్డి, నర్సయ్య, అంతడ్పుల శ్రీనివాస్, ఎండీ.యూనిస్ పాషా, కొమురోజు కృష్ణ, హన్మంతు, శ్రీనివాస్, 36 మంది పీఈటీలు పాల్గొన్నారు.